

# అడుగుపడితే అపాయం

## - కొమ్మూరి సాంబశివరావు



## (గత సంచిక తరువాయి)

"**మిస్టర్ యుగంధర్!** ఫిరోజ్ దగ్గర దొంగిలించిన పత్రాలు మాకు అమ్ముతానన్నాడు ఎవడో. నన్ను వెళ్ళనివ్వండి. వెళ్ళనిస్తే ఆ కాగితాలు మీకు తెచ్చియిస్తాను. కమాన్! దిస్ ఈజ్ ఎ జంటిల్‌మెన్స్ ఎగ్రిమెంట్."

"సరే మనిద్దరమూ వెళదాం."

"నొ నొ! అది వీల్లేదు."

"అయితే మీరు వెళ్ళడానికి వీలులేదు."

"ఆ కాగితాలు సంపాదించడంలో మీకేమీ ఇంట్రస్టులేదా?"

"ఉన్నది. ఇక్కణ్ణించి నేను బయటకి వెళితే ఆరు లక్షల రూపాయలు ఇవ్వకుండానే వాటిని సంపాదించగలను."

"నిజమా!"

"అవును."

"అయితే అతనెవరో చెప్పండి. డబ్బు ఇవ్వకుండా నేనే ఆ కాగితాలు సంపాదిస్తాను. అతనెవరో చెప్పినందుకు మీకు మూడు లక్షలు ఇస్తాను."

"నో! థాంక్యు ఆ పత్రాలు సంపాదించి మా ప్రభుత్వానికి యివ్వాలి. మీ డబ్బులో నాకు యింట్రస్టు లేదు."

"కమ్యూనిస్టు చైనా మీకూ, మాకూ కూడా విరోధే, ఏ ప్రభుత్వానికి ఇస్తేనేం!"

"అయితే నేను మా ప్రభుత్వానికే ఇస్తాను. మీకు అభ్యంతరమేమిటి?" అన్నాడు యుగంధర్.

అంతలో నళిని వచ్చి "ఏమన్నా సహాయం కావాలా?" అడిగింది యుగంధర్ని.

వెనక్కి తిరగకుండా "వెళ్ళి భార్గవప్రసాద్‌నీ, సత్యనారాయణనీ పిలుచుకురా?" అన్నాడు యుగంధర్.

నళిని వెళ్ళిపోయింది.

అంతలో టూవే రేడియో మళ్ళీ 'కు, కూ' అన్నది.

యుగంధర్ పిస్తోలు అతనివైపు గురిపెట్టి వుంచి రేడియో దగ్గరికి వెళ్ళి స్విచ్ నొక్కాడు.

"జమినీ ఒన్ నాట్ ఒన్ ఫోర్ నాట్ ఫోర్ రిసీవింగ్."

"మీరింకా బయలుదేరలేదేం?"

"బయలుదేరుతున్నాను."

"ఇప్పుడు రానవసరంలేదు. రిసీవ్డ్ మెసేజ్ ఫ్రం ది పార్టీ. రాత్రి పదిగంటలకు పత్రాలు తెస్తానన్నాడు. డబ్బు ఎలా యివ్వాలో చెప్పాడు. మీరు రాత్రి ఎనిమిది గంటలకి వస్తే చాలు."

"ఆల్‌రైట్" అని యుగంధర్ రేడియో స్విచ్ నొక్కేశాడు.

సరిగ్గా ఆ సమయానికి భార్గవప్రసాద్, సత్యనారాయణ గదిలోకి వచ్చారు.

"ఆ తెర చింపి, ఆ పీలికలతో యితని చేతులూ, కాళ్ళూ గట్టిగా కట్టండి" చెప్పాడు యుగంధర్ వాళ్ళకి

వాళ్ళు అతన్ని కట్టేసిన తరువాత, యుగంధర్ వెళ్ళి కట్లు యింకా గట్టిగా బిగించి, స్పృహలేని అతన్ని కూడా కట్టేసి "యిప్పుడు ఈ యింట్లోంచి మన తప్పించుకునే మార్గం ఆలోచించాలి" అన్నాడు.

## 12

"కమిన్ ఇన్‌స్పెక్టర్! ఈ ముగ్గురి మీదా తరవాత తీరిగ్గా నేరాలు రాసిస్తాను. వీళ్ళని కస్టడీలోకి తీసుకోండి" అన్నాడు రాజు స్వరాజ్యరావు రాగానే.

"ఈ అమ్మాయి ఎవరు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"నళిని స్నేహితురాలు పార్వతి. ఉద్యోగం కోసం వచ్చి నళిని  ఉద్యోగం కోసం వచ్చి నళిని యింట్లో వుంటున్నాననీ, ఉద్యోగం దొరకలేదనీ అబద్ధం చెప్పింది. నిజానికి ఉద్యోగం మీదే నళిని యింట్లో ఉంటోంది. నళిని భార్గవప్రసాద్ సెక్రటరీ. ఆమెకి నేషనల్ డెయిలీ న్యూస్ పత్రికకి తెలిపే రహస్యాలు తెలుస్తాయి. పార్వతి ముఠా పార్టీకి

వ్యతిరేక ప్రచారం చేసే పత్రిక డెయిలీ న్యూస్. అందుకని పార్వతిని ఆ పార్టీ వాళ్ళు నళిని యింట్లో గుఢచారిగా వుంచారు. తమ పార్టీని గురించి యేం రాయబోతున్నారో ఏం ప్రచారం చేయబోతున్నారో తెలుసుకోవడం ఆమె పని."

ఇన్‌స్పెక్టర్ పార్వతిని పరీక్షగా చూసి "ఫిరోజ్ తెచ్చిన పత్రాల గురించి భార్గవప్రసాద్ నళినికి చెప్పిన విషయాలు తన పార్టీ వాళ్ళకి చెప్పిందన్నమాట" అన్నాడు.

"ఈ పార్వతి చెపితేనా వారికి తెలిసేది. ఆ పార్టీ వాళ్ళు ముందు నించీ ఫిరోజ్‌ని వోకంట కనిపెడుతూనే వుండి వుండాలి. ఆ వివరాలన్నీ తరవాత తెలుస్తాయి."

"అయితే నళినినీ, ఈ పార్వతిని కట్టిపడేసింది ఎవరు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"ఇన్‌స్పెక్టర్! ఫిరోజ్ దగ్గరున్న పత్రాల కోసం ఓ ముఠావాళ్ళు చాలాసార్లు ప్రయత్నించారని నా అనుమానం. ఆ చిక్కుముళ్ళు విప్పడం సాధ్యం కాదు. వివరాలు మనకి తెలియవు. ఇప్పుడు నా సమస్య అదికాదు. యుగంధర్" అన్నాడు రాజు.

"గాలిలో కలిసిపోయినట్లు మాయమయిన యుగంధర్, భార్గవప్రసాద్ మొదలయినవాళ్ళ విషయం నేను దర్యాప్తు చేశాను. ఏమీ తెలియలేదు."

"యింతమంది మాయమవడం, వాళ్ళ ఆచూకీ ఏమీ తెలియకపోవడం ఆశ్చర్యంగా వుంది. ఈ సంఘటనలన్నీ ఫిరోజ్ దగ్గరున్న పత్రాల కోసం జరిగాయి. అవి చైనీస్ గూఢచారులకి దొరకలేదని తెలుస్తూనే వుంది."

"ఫిరోజ్ యుగంధర్‌గారికి అవి యివ్వలేదు. భార్గవప్రసాద్‌కి యివ్వలేదని అనుకోవచ్చు. ఎవరో ఆ పత్రాలు అపహరించారనేది నిశ్చయం. యుగంధర్‌గారినీ, మిగతా వాళ్ళనీ ఎత్తుకుపోయిన వాళ్ళ దగ్గిరా ఆ పత్రాలు లేవని అనుకోవచ్చు. ఉంటే వీళ్ళని ఎత్తుకుపోవలసిన అవసరమేమున్నది?

"స్పెషల్ బ్రాంచ్ ఏజంటు హత్య చెయ్యబడ్డాడు. స్పెషల్ బ్రాంచి తరపున నేనూ, యుగంధర్‌గారూ దర్యాప్తు చేస్తున్నాం. చైనీస్ గూఢచారులు కాక యింకెవరో ఫిరోజ్ తెచ్చిన పత్రాలకోసం ప్రయత్నిస్తున్నారు. వాళ్ళెవరో తెలిస్తే యుగంధర్‌గారిని విడిపించవచ్చు" అన్నాడు రాజు.

"ఎలా తెలుస్తుంది?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"ఊహించవచ్చునని అనుకుంటాను. దయచేసి వీళ్ళ విషయం మీరు చూడండి. నాకు పనున్నది" అన్నాడు రాజు.

13

యుగంధర్ టూవే రేడియో పరీక్ష చేశాడు. వేవ్‌లెంగ్త్ మార్చి పోలీస్ కంట్రోల్ రూముతో మాట్లాడటానికి వీలుంటుందేమో చూశాడు. వేవ్‌లెంగ్త్ మార్చడానికి  వీలులేకుండా ఆ ట్రాన్స్మిటింగు సెట్ నిర్మింపబడింది. కిటికీ దగ్గరికి వెళ్ళి చూశాడు. తోటలో ఆల్సేషియన్ కుక్కలు తిరుగుతున్నాయి. దూరంగా చెట్ల దగ్గర కూర్చుని మొక్కలకి కలుపు తీస్తున్నారు నలుగురు మనుషులు.

తలుపు కొద్దిగా తెరిచి చూశాడు. చివర్లో స్టేషను వాగన్ గుమ్మం దగ్గర ఆగి వుంది. ఒక్క గంతులో ఆ స్టేషన్ వాగన్ దగ్గరికి వెళ్ళి కుక్కలు వచ్చేలోపున కారు ఎక్కి తలుపులు మూసెయ్యవచ్చు. కానీ ఏం ప్రయోజనం. తోటమాలి వేషంలో నలుగురున్నారు తోటలో. పిస్తోళ్ళతో టైర్లు పేల్చారంటే తను వాళ్ళకి చిక్కిపోతాడు.

"ఏమిటి యుగంధర్ ఆలోచిస్తున్నారు?" అడిగాడు భార్గవప్రసాద్.

యుగంధర్ జవాబు చెప్పకుండా ఆ గదిలోంచి వెళ్ళిపోయాడు. పావుగంటలో తిరిగి వచ్చి "మీ యిద్దరికీ చాలా బాధ్యతగల పని చెపుతాను. ఈ గదిలో యిక్కడే కూర్చోండి. అతను లేవడానికి ప్రయత్నిస్తే నిర్దాక్షిణ్యంగా తలమీద ఓ దెబ్బ కొట్టండి. నేను తిరిగి వచ్చేవరకూ చాలా జగ్రత్తగా వుండండి. ఇతను తప్పించుకుంటే మనం ఇక్కడినించి బయటపడే అవకాశం పోతుంది" అని లక్ష్మికీ, నళినికీ చెప్పి భార్గవప్రసాద్‌నీ, సత్యనారాయణనీ తనతో రమ్మన్నాడు.

ముగ్గురూ భోజనాల గదిలోకి వెళ్ళారు. బల్లమీద కొన్ని డబ్బాలు, టిన్ ఓపెనర్స్ వున్నాయి. ఓ మూల పొడుగాటి తాడు పడివుంది.

"ఇవి టిండ్ మీట్ డబ్బాలు. ఈ తాడు వుండటం మన అదృష్టం" అన్నాడు యుగంధర్.

అవి తీసుకుని ముగ్గురూ డాబా మీదికి వెళ్ళారు. పిట్టగోడ దాటి కిటికీ షెడ్ మీదికి జారాడు యుగంధర్. ఓ డబ్బా తెరిచి, అందులోంచి రెండు మాంసం ముక్కలు తీసి తోటలో తిరుగుతున్న ఓ కుక్క ముందుకి విసిరాడు. వెంటనే యింకో రెండు కుక్కలు వచ్చాయి. మూడూ మాంసం కోసం పోట్లాడటం ప్రారంభించాయి. ఇంకో రెండు ముక్కలు విసిరాడు యుగంధర్. ఇంకో రెండు కుక్కలు పరిగెత్తుకుంటూ వచ్చాయి. తోటలో వున్న నలుగురికీ కనిపించకుండా జాగ్రత్తపడుతూ మాంసం ముక్కలు కిందికి విసురుతూనే వున్నాడు పన్నెండు కుక్కలూ అక్కడికి వచ్చేవరకూ. అన్ని కుక్కలూ ఒకచోట చేరిన తరవాత కొంచెం దూరంగా యింకా కొన్ని మాంసం ముక్కలు పడేశాడు. కుక్కలన్నీ అక్కడికి వచ్చాయి. అట్లా దూర దూరంగా మాంసం ముక్కలు పడేస్తూ కుక్కలన్నీ యింటివెనక వైపుకి వెళ్ళేట్లు చేశాడు.

"నేను కిందికి దిగుతాను" అన్నాడు యుగంధర్.

"గుడ్ గాడ్! కుక్కలు చీల్చేస్తాయి. ఒద్దు" అన్నాడూ భార్గవప్రసాద్.

యుగంధర్ నవ్వి "ఆఖరు షెడ్ మీద ఆగిపోతాను. నేలకు పది అడుగులపైన వుంటాను కనుక కుక్కలు ఏమీ చెయ్యలేవు. ఏమీ చెయ్యలేక మొరుగుతాయి నన్ను చూసి. అప్పుడు కాపలా వున్న వాళ్ళలో ఒకడు వస్తాడు. మీరు పైనించి చూస్తూ వుండి ఎవరన్నా వస్తూ వుంటే నాకు చెప్పండి" అని తాడు తీసుకుని ఒక కొన పిట్టగోడకి వున్న కొక్కానికి బిగించి ముడివేశాడు. రెండో కొన పట్టుకుని వుచ్చులా ముడివేసి దాన్ని తీసుకుని కిందికి దించాడు. కిందికి దిగుతున్న యుగంధర్ని చూసి కుక్కలు మొరగడం ప్రారంభించాయి. ఆఖరు షెడ్మీద నిలబడి కాసిని మాంసం ముక్కలు కుక్కల ముందు పడేట్లు విసిరేసాడు.

అంతలో "ఎవడో వస్తున్నాడు" అన్నాడు భార్గవప్రసాద్ డాబామీద నుంచి.

"ఏమిటి! ఎందుకలా మొరుగుతున్నాయి" అంటూ అతను షెడ్ వయిపు వచ్చాడు. అతని దృష్టి కుక్కల మీద వుండడం వల్ల షెడ్ మీద వున్న యుగంధర్ని చూడలేదు.

"చేతులు పైకెత్తు. ఎత్తే వుంచు. పిచ్చివేషాలు వేశావా నిన్నూ, నీ కుక్కలనీ కాల్చి చంపేస్తాను" అన్నాడు యుగంధర్. తాడు అతని తలమీద నించి చేతుల మీదనించి ఛాతీ మీదకి జారగానే గట్టిగా లాగాడు. అలా లాగగానే తాడు అతని ఛాతీ చుట్టూ బిగుసుకుపోయింది.

"క్విక్! ఇతన్ని పైకి లాక్కోండి" అని డాబా మీద వున్న వాళ్ళకి చెప్పి "తాడు గట్టిగా పట్టుకో కిందపడితే ఛస్తావు" అన్నాడు యుగంధర్ అతనితో.

నిమిషంలో అతన్ని డాబా మీదకి లాగేశారు భార్గవప్రసాద్, సత్యనారాయణా కలిసి.

"కదలకుండా కట్టి వెయ్యండి. తరువాత తాడు నాకు విసిరెయ్యండి. ఇంకొకడు వస్తాడు. వస్తూ వుంటే నాకు చెప్పండి" అన్నాడు యుగంధర్.

ఇంటి వెనక్కి వెళ్ళిన కుక్కలు మొరుగుతూనే వున్నాయి. వాటిని చూడడానికి వెళ్ళిన అతను తిరిగి రాలేదు. ఏమయ్యాడా అనుకుంటూ ఇంకొకడు వచ్చాడు. అతన్నీ అదే విధంగా డాబా మీదకి లాగేసాడు. నలుగుర్నీ డాబా మీదికి లాగేసారు. నలుగుర్నీ డాబామీదికి లాగి బంధించడానికి గంట సేపు పట్టింది. వాళ్ళని కిందికి తీసుకువెళ్ళి ఓ గదిలో పడేసి గడియపెట్టాడు.

"ఇప్పుడిక మనకి మిగిలిన సమస్య ఆ కుక్కలు. కష్టంకాదనుకుంటాను" అని వంటయింట్లోకి వెళ్ళాడు యుగంధర్. రెండు మాంసం డబ్బాలు, రెండు బిస్కట్ల డబ్బాలు తీసుకుని డాబా మీదికి వెళ్ళి కుక్కలు చేరిన చోట కుప్పగా పోసాడు. బిస్కట్లూ, మాంసం ముక్కలూ తినడంలో నిమగ్నమై వున్నాయి ఆ కుక్కలు.

"క్విక్! రండి పోదాం" అన్నాడు యుగంధర్. తలుపు తెరిచి గుమ్మానికి ఎదురుగా వున్న స్టేషన్ వాగన్‌లోకి ఎక్కాడు. కారు తాళం చెవులు కారులోనే వున్నాయి.

అందరూ ఎక్కగానే కారు స్టార్టు చేశాడు. గేటు మూసేసి వుంది. "క్విక్! ఎవరన్నా దిగి గేటు తెరవండి" అన్నాడు యుగంధర్.

ముందు సీటులో కూర్చున్న నళిని వెళ్ళి గేటు లాగింది. తెరుచుకోలేదు. "గేటుకి గడియలేదు. తాళం లేదు. అయినా రావడంలేదు" నళిని చెపుతుండగానే బొయ్‌మని అరుస్తూ కుక్కలు పరిగెత్తుకు రావడం చూసి కారు దగ్గరికి పరిగెత్తింది. కారు ఎక్కగానే తలుపు మూసేశారు. కుక్కలన్నీ కారు చుట్టూ చేరాయి. కారుమీద కాళ్ళు వేసి, అద్దాలకి మొహాలు ఆనించి అరుస్తున్నాయి.

గేటు యెందుకు తెరుచుకోలేదని గేటునీ, గేటు పక్కన వున్న గోడలనీ పరీక్షగా చూసాడు యుగంధర్. గోడ పక్కనించి ఒక తీగ, గేటు కీలు వుండవలసిన చోట ఓ చిన్న డబ్బా కనిపించాయి. అర్థమైంది యుగంధర్‌కి... ఎలక్ట్రికల్లీ ఆపరేటెడ్ గేట్, స్విచ్ నొక్కితే కాని తెరుచుకోదు. స్విచ్ ఎక్కడున్నదో తెలుసుకుని స్విచ్ నొక్కడం ఇప్పుడెలా సాధ్యం? కుక్కల్ని తప్పించుకుని వెళ్ళడం ఎలా? అద్దం కొంచెం దింపి పిస్తోలుతో కుక్కల్ని కాల్చి చంపెయ్యవచ్చు. కాని వాటిని చంపడానికి యుగంధర్‌కి మనసు రాలేదు. ఏ పాపమూ చెయ్యని జంతువుల్ని చంపడమా! నెమ్మదిగా కారు వెనక్కి నడిపాడు. గేటుకి ఎదురుగా కాకుండా పక్కకి వెళ్ళి గోడలనించి గేటు కీలుకి వున్న తీగెలని చటుక్కున లాగేశాడు, తెగిపోయాయి. త్వరగా చెయ్యి లాగేసుకోవడం వల్ల షాక్ తగలలేదు. రెండో వైపు వున్న తీగెలని కూడా అలాగే లాగేసాడు. ఇక గేటు తెరవాలి. ఆ గేటు తలుపులు లోపలికి తెరుచుకుంటాయి. ఒక ఆలోచన తట్టింది యుగందర్ కి.

"మీ ఇద్దరు ఆడవాళ్ళలో ఒకరు చీర విప్పెయ్యండి" అన్నాడు.

"ఎందుకు?" అడిగింది లక్ష్మి.

"చీరని పొడుగ్గా చింపి, రెండు తాళ్ళ కింద పేని ఇవ్వండి."

నళిని సందేహించలేదు. విప్పి నిలువునా చింపింది. పరికిణీ, జాకెట్‌తో కూర్చున్నది. మొగవాళ్ళిద్దరూ ఆ చీర ముక్కలని తాళ్ళలా పేనారు.

యుగంధర్ అద్దం తెరిచి, ఒక తలుపుకి తాడు ముడి వేసాడు. గేటుకీ, కారుకీ కుక్క దూరేంత సందు లేనందువల్ల కుక్కలు యేం చేయలేకపోయాయ్. రెండో కొన లక్ష్మికిచ్చి "ఒదులుగా పట్టుకోవాలి. వదిలెయ్యకూడదు" అని ఇంకో తాడు రెండో తలుపుకి కట్టి కారు టాపుమీదనించి అవతలవైపుకి విసిరాడు. తన పక్కన కూర్చున్న సత్యనారాయణని చూసి "అద్దం కొంచెం దింపి ఆ తాడు లోపలికి లాగి పట్టుకోండి" అన్నాడు. కారుని వెనక్కీ, ముందుకీ పోనిచ్చి గేటుకి ఎదురుగా తెచ్చాడు. "ఇప్పుడు తాళ్ళు గట్టిగా పట్టుకోండి. కారు రివర్సు చేస్తున్నాను" అని కారు వెనక్కి పోనిచ్చాడు. గేటు రెండు తలుపులకీ రెండు తాళ్ళు కారుకి చెరొక వైపు వున్నాయి. కారు వెనక్కిపోతూ వుంటే గేటు తలుపులు తెరుచుకుంటున్నాయి. పూర్తిగా తెరుచుకునే దాకా వెనక్కిపోయి "ఇక తాళ్ళు వదిలెయ్యండి" అని కారుని స్పీడుగా తోలాడు.

చెరలోంచి తప్పించుకున్నందుకు కారులో వున్న వాళ్ళందరూ నిట్టూర్పులు వొదిలారు.

14

"రాయబారి కార్యాలయం అండగా పెట్టుకుని, గూఢచారత్వం చెయ్యడం మీలాటి వారిని ఎత్తుకుపోయి బంధించడం సహించకూడని పని. కిడ్నాప్, అసాల్టు మొదలైన దజను ఛార్జీలు పెట్టి ఒక్కొక్కళ్ళనీ ఆరేళ్ళు జైల్లో పారేయిస్తాను" అన్నాడు పోలీస్ కమీషనర్ కోపంగా.

యుగంధర్ నవ్వి "రాజకీయాలు అంటే అంతే. మీరు కోపం తెచ్చుకుని ప్రయోజనం లేదు. మీరేమీ ఛార్జీలు మోపకండి. భారత ప్రభుత్వపు హోం మంత్రికి తెలియజేసి ఆయన సలహా ప్రకారం చెయ్యండి అదీ తరువాత. ప్రస్తుతానికి వాళ్ళని లాకప్‌లో వుంచండి. వాళ్ళని పట్టుకున్నట్లు బయటికి పొక్కకూడదు. మనకింకా పని వున్నది" అన్నాడు యుగంధర్.

"రాజు ఫోన్ చేస్తే వెంటనే నాకు ఫోన్ చెయ్యమని చెప్పండి. ఘటికులయిన ఇద్దరు సి.ఐ.డి.లని భార్గవ ప్రసాద్‌ని కనిపెట్టమనండి. ఆయన బయటికి వెళితే వెంబడించి వెళ్ళమని చెప్పండి."

స్టేషన్ వాగన్‌లో కూర్చుని వున్నారు భార్గవప్రసాద్, లక్ష్మి, నళిని, సత్యనారాయణ.

"స్టేషన్ వాగన్ యిక్కడే వుండాలి టాక్సీని పిలుస్తున్నాను. మీరు మీ యిళ్ళకి వెళ్ళండి" అని భార్గవ ప్రసాద్‌ని పక్కకి పిలిచి ఏదో చెప్పి యుగంధర్ పోలీస్ కారులో తన యింటికి బయలుదేరాడు.

❦❦❦

రాత్రి ఎనిమిది గంటలయింది. యుగంధర్ ఓ విదేశ రాయబారి కార్యాలయం ప్రాంతాల గేటుకి దూరంగా చెట్టు వెనక నిలుచున్నాడు.

ఎనిమిదిన్నరకి ఒకతను తలుపు తెరుచుకుని బయటకి వచ్చాడు. అతని చేతిలో ఓ తోలు పెట్టె వుంది. ఆ రాయబారి కార్యాలయంలో అతను, అసిస్టెంట్ సెక్రటరీ. యుగంధర్ గుర్తుపట్టాడు. అతను కారెక్కి స్టార్ట్ చేయగానే యుగంధర్ చెట్టు క్రింద నుంచి కదిలి కాస్త దూరంలో వున్న తన కారు ఎక్కాడు.

గ్రాండ్ సదరన్ ట్రంక్‌రోడ్డుమీద నెమ్మదిగా డ్రయివ్ చేస్తున్నాడు అసిస్టెంట్ సెక్రటరీ. కాస్త వెనకగా యుగంధర్ అతన్ని వెంబడించాడు.

తాంబరం దాటేశారు. రోడ్డు మీద దీపాలు లేవు. రోడ్ పక్కల యిళ్ళులేవు. అంతా చీకటి. అప్పుడప్పుడు బస్సో, లారీనో ఎదురవుతోంది. ఇరవై ఒక్క మైలు రాయికి దూరంగా ఆ సెక్రటరీ కారు ఆపి, దిగి నడవడం ప్రారంభించాడు. వెంటనే యుగంధర్ తన కారు ఆపి రోడ్డు మీద కాక పక్కనున్న పొలాలలోంచి చప్పుడు చెయ్యకుండా పరిగెత్తాడు.

రోడ్‌మీద టార్చి వెలిగింది. వెలుగు సెక్రటరీ మీద పడ్డది.

"తెచ్చావా!" అడిగాడు టార్చి వెలిగించిన మనిషి. ఆ గొంతు ఎక్కడో విన్నట్లుంది యుగంధర్‌కి.

"తెచ్చాను. నువ్వు తెచ్చావా?" అడిగాడు అసిస్టెంట్ సెక్రటరీ.

"ఆఁ ఇదుగో" అంటూ అతను ముందుకి వచ్చాడు.

టార్చిలైటు పట్టుకున్న అతను టార్చి వొదిలేసి ఒక్క వురుకు వురికి అసిస్టెంటు సెక్రటరీ మీద పడ్డాడు. సెక్రటరీ చేతిలో వున్న పిస్తోలు పేలింది.

"రాస్కెల్! నన్ను పిస్తోలుతో కాలుద్దామనుకున్నావా? నీ చేతిలో పిస్తోలుంటుందని నాకు తెలుసు. జాగ్రత్తపడ్డాను. చెప్పు యుగంధర్‌ని ఎక్కడ బంధించావు? చెప్పకపోతే గొంతు నలిపి చంపేస్తాను. చెప్పు" అన్నాడతను.

యుగంధర్ ఆశ్చర్యానికి అంతులేదు. అది తన అసిస్టెంటు రాజు గొంతు.

"రాజూ! అతన్నేం చెయ్యక, నేను క్షేమంగానే వున్నాను" అంటూ వాళ్ళ దగ్గరికి వెళ్ళాడు.

❦❦❦

"ఫిరోజ్ తెచ్చిన రహస్య పత్రాలు సంపాదించడానికి చైనా గూఢచారులు తాపత్రయపడుతున్నారు. మిమ్మల్నీ, భార్గవప్రసాద్‌నీ, మిగతావాళ్ళనీ బంధించింది వాళ్ళేనా అని ఆలోచించాను. చైనా గూఢచారులు మిమ్మల్ని చంపడానికి ఈ అవకాశం దొరికినపుడు చంపుతారు కాని, ఎందుకు ఎత్తుకుపోతారు? కనుక ఎవరో పాశ్చాత్య గూఢచారులు మిమ్మల్ని బంధించి వుంటారని నిశ్చయించుకున్నాను. ఏ పాశ్చాత్య అదేశపు గూఢచారులు ఈ పనిలేకవుంటారు? చైనాతో బద్ధ విరోధంగా వున్న దేశమై వుండాలనుకుని ఆ రాయబార కార్యాలయానికి ఫోన్ చేశాను. ఆ పత్రాలు నా దగ్గర వున్నాయనీ, ఆరు లక్షల రూపాయలు యిస్తే నా దగ్గర వున్నాయనీ ఆరు లక్షల రూపాయలు యిస్తే యిస్తాననీ చెప్పాను. నాతో మాట్లాడిన ఆ రాయబారి ఉద్యోగి ఒప్పుకున్నాడు. నన్ను ఎక్కడ ఎప్పుడు కలుసుకోవాలో చెప్పాను. అతన్ని చితకబారి మిమ్మల్ని ఎక్కడ దాచినదీ తెలుసుకోవాలనుకున్నాను" చెప్పాడు రాజు యుగంధర్‌కి.

యుగంధర్, రాజు, ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు భార్గవ ప్రసాద్ యింటికి వెళ్ళారు. పది నిమిషాల తరువాత రాజు వెళ్ళిపోయాడు.

"నేనూ, లక్ష్మి బీచికి వెళ్ళి కారులో కూర్చున్నాం. పేవ్‌మెంటు పక్కనవున్న సిమెంటు సీటు మీద కూర్చున్నాడు డ్రైవర్. రాత్రి పదిగంటలకి యింటికి వచ్చేశాము. మీరు పొరపడ్డారేమో" అన్నాడు భార్గవప్రసాద్.

"అవును. పొరబడ్డాను. ఆ రాయబారి ఉద్యోగికి పత్రాలు తన దగ్గర వున్నాయని ఫోన్ చేసింది నా అసిస్టెంట్ రాజు. మీ డ్రయివర్ కాదు" అన్నాడు యుగంధర్.

అంతలో టెలిఫోన్ మోగింది. భార్గవప్రసాద్ రిసీవర్ తీసుకుని మాట్లాడి "డ్రయివర్‌కి" అని నౌకర్ని పిలిచి డ్రైవర్‌కి కబురు పంపాడు.

డ్రైవర్ వచ్చి టెలిఫోనులో రెండు నిమిషాలు మాట్లాడి. 'ఊ! సరే ' అని రిసీవర్ పెట్టేసి వెళ్ళిపోయాడు. నిమిషం తరువాత యుగంధర్ లేచి బయటికి వెళ్ళి మోటార్ గారేజ్ పక్కన చీకటిలో నిలుచున్నాడు.

పది నిముషాల తరువాత గారేజ్ వెనకవున్న గదిలోంచి డ్రయివర్ బయటికి వచ్చి, ఇటూ అటూ చూసి రెండడుగులు ముందుకు వేశాడు.

యుగంధర్ అతని భుజం మీద చెయ్యివేసి "ఎక్కడికి వెళుతున్నావు?" అడిగాడూ.

డ్రైవర్ ఉలిక్కిపడి రెండు చేతులు ఎత్తాడు యుగంధర్‌ని కొట్టడానికి.

సునాయాసంగా అతని రెండు చేతులూ వెనక్కి విరిచి పెట్టి "పిచ్చి పనులు చెయ్యక, రా!" అని చరచరా అతన్ని యింట్లోకి లాక్కెళ్ళాడు యుగంధర్.

"ఫిరోజ్ తెచ్చిన పత్రాలు ఇతని దగ్గర వున్నాయి. జేబులు వెతికితే కనిపిస్తాయి" అన్నాడు.

"అవును సార్! అవే" అన్నాడు.

ఆ కాగితాలు మడిచి జేబులో పెట్టుకున్నాడు యుగంధర్.

"ఫిరోజ్‌కి యిస్తానన్న డబ్బు మీకిస్తాను. ఆ కాగితాలు నాకు యివ్వండి యుగంధర్" అడిగాడు భార్గవప్రసాద్.

"నేను భారత ప్రభుత్వం తరపున పనిచేశాను కనుక, యీ కాగితాలు భారత ప్రభుత్వానికే యిస్తాను" అన్నాడు యుగంధర్.

"మా డ్రయివర్ దగ్గర ఆ పత్రాలు వున్నాయని మీరు ఎలా గ్రహించారు?" అడిగాడు భార్గవప్రసాద్.

యుగంధర్ గొంతు సవరించుకుని, సిగరెట్ వెలిగించి "అసలు జరిగిందేమిటో చెపుతాను వినండి. మీరు నిర్వహిస్తున్న నేషనల్ డైలీ న్యూస్ పత్రిక చైనాకి ప్రతికూల ప్రచారం చేస్తున్నదని చైనాకి తెలుసు. ఎలాగయినా మీ పత్రికకి అంతరాయం కలిగించాలని యిద్దరు గూఢచారులని నియమించారు చైనావాళ్ళు. ఆ గూఢచారులిద్దరూ మన దేశస్తులే. పార్వతి, మీ డ్రయివర్. డబ్బుకోసమో, రాజకీయ ఆదర్శాలకోసమో వాళ్ళిద్దరూ చైనా తరపున గూఢచారత్వం సాగించారు.

ఫిరోజ్ సిలోన్‌నించి పారిపోయి మన దేశానికి రావడం మన స్పెషల్ బ్రాంచికి తెలుసు. చైనా గూఢచారులకీ తెలుసు. చైనా అంటే గిట్టని ఓ పాశ్చాత్య రాజ్య రాయబార ఉద్యోగులకీ తెలుసు.

ఫిరోజ్ మీకు ఫోన్ చేసి మిమ్మల్ని కలుసుకున్నాడు. మీ డ్రయివర్ చైనా తరపు గూఢచారని మీకు తెలియదు కనుక, కారులో కూర్చుని అతని దగ్గరున్న పత్రాలు కొనే విషయం ఫిరోజ్‌తో మాట్లాడారు మీరు.

నిజానికి మీరు మాట్లాడిన విషయాలు చైనాకి తెలియచేయాలి డ్రయివర్. కానీ మీరు మూడు లక్షలు యిస్తానని ఫిరోజ్‌కి చెప్పగానే మీ డ్రయివర్‌కి డబ్బు ఆశ కలిగింది. ఆ రహస్య పత్రాలు తను సంపాదించగలిగితే తనకు మూడు లక్షలు వస్తాయికదా అనుకున్నాడు.

గ్రాండ్ హోటల్ దగ్గర కారులో కూర్చుని మీరూ, ఫిరోజ్ మాట్లాడుకుంటుండగా మర్యాదకి కారు దిగినట్లు దిగి అవతలకి వెళ్ళాడు మీ డ్రయివర్. హోటల్లో తనే గదిలో వుంటున్నదీ ఫిరోజ్ మీకు చెప్పడం విన్నాడతను.

ఫిరోజ్ తనకూడా ఆ పత్రాలు తీసుకొచ్చి వుండడనీ, తన గదిలో దాచి వుంటాడనీ అనుకుని అతని గదికెళ్ళి మారుతాళం చెవితో తలుపు తెరిచి, కాయితాల కోసం వెతికి వుంటాడు. అయిదు నిముషాల్లో వాటిని సంపాదించి బయటికి వచ్చి వుంటాడు.

ఫిరోజ్ ఎక్కడ బస చేసినదీ అప్పుడే తెలుసుకున్న చైనీస్ గూఢచారులు డ్రయివర్‌ని హోటల్ ముందు చూసి వుంటారు. ఫిరోజ్ ఏ గదిలో బస చేసినదీ మీ డ్రయివర్ వాళ్ళకి చెప్పి వుంటాడు. ఫిరోజ్ తన గదిలోకి వెళ్ళేదాకా కాచుకుని, అతని వెనకే వెళ్ళి అతన్ని హత్య చేసారు చైనా గూఢచారులు.

ఫిరోజ్ గదిలోంచి తాను కాయితాలు దొంగిలించినట్లు చైనా గూఢచారులు అనుమానించకూడదు. అందుకని వారిని తప్పుదోవ పట్టించాడు మీ డ్రయివర్.

స్పెషల్ బ్రాంచ్ ఏజంట్ ఆ కాయితాలు సంపాదించాడని గూఢచారులకు చెప్పి వుంటాడు. అందుకే వాళ్ళు స్పెషల్ బ్రాంచ్ ఏజంటుని చంపారు. అతని జేబులు వెతికి ఆ పత్రాలు అతని దగ్గర లేవని నిశ్చయమైన తరవాత వాటిని ఫిరోజ్ నాకు యిచ్చి వుంటాడని డ్రయివర్ వారికి చెప్పి వుంటాడు. అందుకే వాళ్ళు నన్ను హత్య చేయడానికి ప్రయత్నించారు.

ఆ పత్రాలు చేజిక్కించుకునేందుకు చైనీస్ గూఢచారులు ఒకవైపు ప్రయత్నిస్తున్నారు. ఇంకోవైపు చైనా అంటే గిట్టని పాశ్చాత్య రాజ్య గూఢచారి ప్రయత్నిస్తున్నాడు.

చైనా గూఢచారులు యింకా ఆ పత్రాల కోసం ఆరాటపడుతుండటం వల్ల వారికి అవి చిక్కలేదని నిశ్చయించుకుని వుంటాడు ఆ పాశ్చాత్య గూఢచారి. వాటిని నాకిచ్చాడో, మీకిచ్చాడో తెలియలేదు అతనికి. మీకు యిచ్చి వుంటే మీరు వాటిని న్యూస్ ఎడిటర్ సత్యనారాయణకి యిచ్చి వుండవచ్చు. లేదా దాచమని నళినికి యిచ్చి వుండవచ్చు. మీరు మీ యింట్లో దాచిపెట్టి వుంటే మీ భార్యకి తెలిసి వుంటుంది . ఇలా ఆలోచించి వుంటాడా పాశ్చాత్య గూఢచారి.

అందుకే అతను నళిని ఇల్లు వెతికాడు, మీ ఇల్లూ, నా ఇల్లూ కూడా వెతికాడు ప్రయోజనం లేకపోయింది.

మనల్నందరినీ ఒకచోట బంధించి లాలించో, బెదిరించో తెలుసుకోవచ్చని మన ఐదుగురినీ ఎత్తుకుపోయి ఆ ఇంటిలో అట్టేపెట్టాడు. ఆ తరవాత జరిగిందంతా మీకు తెలుసు" చెప్పాడు యుగంధర్.

"నేనడిగిన ప్రశ్నకి జవాబు చెప్పనేలేదు మీరు. నా డ్రయివరు దగ్గర ఆ కాయితాలు వున్నాయని మీరెట్లా తెలుసుకున్నారు?" అడిగాడు భార్గవప్రసాద్.

"ఆ పత్రాలు మనలో ఎవరి దగ్గరా లేవు. చైనా గూఢచారులకి దొరకలేదు. పాశ్చాత్య గూఢచారికీ చిక్కలేదు. స్పెషల్ బ్రాంచ్ ఏజంటు దగ్గరా లేవు. ఏమయ్యాయి. ఫిరోజ్ ఆ పత్రాలు తెచ్చాడని యింకెవరికి తెలుసు. ఆలోచించాను.

మీరూ, ఫిరోజ్ కారులో మాట్లాడుకున్నారు. మీ డ్రయివర్ మీ సంభాషణ విని వుంటాడని మనకెవరికీ స్ఫురించలేదు. ఆ విషయం నాకు స్ఫురించగానే ఆ పత్రాలు అపహరించే అవకాశం మీ డ్రయివర్‌కి వుందా అని ఆలోచించాను. అవకాశం వుంటే వుండవచ్చు కాని వ్యవధి లేదేమో అనుకున్నాను. అందుకే మిమ్మల్ని అడిగాను ఫిరోజ్‌ని హోటల్ దగ్గర వెంటనే దింపి మీరు వెళ్ళిపోయారా అని. వెంటనే దింపలేదనీ, కారులో కూర్చుని కొంతసేపు మాట్లాడుకున్నామని మీరు చెప్పగానే నాకు కలిగిన అనుమానం రూఢి చేసుకునేందుకు మీరు కారులో కూర్చున్నంతసేపూ డ్రయివర్ అతని సీటులో కూచున్నాడా అని మిమ్మల్ని అడిగాను. లేడనీ దిగి అవతలకి వెళ్ళాడనీ మీరు చెప్పగానే ఆ వ్యవధిలో డ్రయివర్ హోటల్లోకి వెళ్ళి పత్రాలు అపహరించి వుంటాడని నిశ్చయించుకున్నాను.

మీ డ్రయివర్‌ని బెదిరించో, డబ్బు ఆశ చూపించో ఆ పత్రాల విషయం బయటికి లాగాలి. అందుకే డ్రయివర్‌కి ఫోన్ చేసి ఆ పత్రాలిస్తే నాలుగు లక్షలిస్తానని రాజుని చెప్పమన్నాను. అదే యిందాక డ్రయివర్ కోసం వచ్చిన ఫోన్‌కాల్" అన్నాడు యుగంధర్.

స్వరాజ్యరావు లేచి నిలబడి "థాంక్స్ యుగంధర్! ఫిరోజ్ హత్యకి సంబంధించినంతవరకూ కేసు పూర్తయింది. ఆ చైనీస్ గుఢచారులని ఛార్జి చెయ్యవద్దనీ, స్పెషల్ బ్రాంచ్‌కి అప్పగించమనీ హోం శాఖనించి ఆదేశం వచ్చింది. ఇక మిగతా విషయాలు, గుఢచ్ఛారులు, ప్రతి గుఢచారులు అవన్నీ నాకు అయోమయంగా వున్నాయి. మీరెంత వివరంగా చెప్పినా నాకు ఇంకా సందేహాలు మిగిలేవున్నాయి" అన్నాడు.

యుగంధర్ నవ్వి "మీకే కాదు నాకూనూ. గుఢచారులు యికొకరికి తెలియకుండా రహస్యంగా కొన్ని కొన్ని పనులు చేస్తారు. కనుక అన్ని విషయాలూ వివరంగా, నిశ్చయంగా మనకి తెలియవు. చైనా తరపున మన దేశంలో గూఢచారత్వం సాగిస్తున్న వాళ్ళలో కొంతమంది పట్టుబడినందుకూ ఫిరోజ్ తెచ్చిన రహస్య పత్రాలు సంపాదించి మన ప్రభుత్వానికి ఇవ్వగలిగినందుకూ తృప్తిపడదాం" అన్నాడు యుగంధర్.

(సమాప్తం)

Post your comments